RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఇండియా కూటమి భేటీ రద్దు

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

ఇండియా కూటమి భేటీ రద్దు చేస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో జరగాల్సిన ఇండియా కూటమి సమావేశం రద్దయినట్లు కాంగ్రెస్ తెలిపింది. ఈనెల మూడోవారంలో సమావేశం జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశానికి హాజరుకావడం లేదని బెంగాల్ సీఎం




మమతా బెనర్జీ , సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో కూటమిలోని పార్టీల మిగతా 2లో

RANGAREDDY, EDITION : 01, VOLUME :202 EDITOR: CHERUKU UPENDAR, DATE : THURSDAY 07 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 202 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 07 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



### మిగ్‌జాం తుపాను పట్ల అధికారులు
## అప్రమత్తంగా ఉండాలి

**పీసీసీ అధ్యక్షుడు కాబోయే సిఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మిగ్‌జాం తుపాను ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా చూడాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ ప్రకటనలో అధికారులకు సూచించారు. లోతట్టు, ఏజెన్సీ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పలు ప్రాంతాల్లో ధాన్యం రాశులు తడిసి పోయే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోందని, ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టిపెట్టాలని, ఎక్కడికక్కడ రైతులకు అండగా నిలిచి అవసరమైన సహాయ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మిగతా 2లో

# కాంగ్రెస్‌కు ఊపిరి..!



- జడ్పీటీసీ టూ సీఎం...
- పార్టీకి అనూహ్య విజయం
- 200 శాతం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కృషి
- ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

మహబూబ్ నగర్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ ఎన్నికల్లో పదేళ్ల పాటు అప్రతీహతంగా అధికారం చెలాయించిన బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీకి అనూహ్య విజయాన్ని కట్టబెట్టారు రాష్ట్ర ప్రజలు. అసలు కాంగ్రెస్ పార్టీనే లేదన్న పరిస్థితి నుంచి.. నేడు రాష్ట్రంలో అధికారం చేపట్టే స్థాయికి చేరుకుంది. ఈ స్థాయికి చేరడానికి ప్రధాన కారణం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కృషి 200 శాతం ఉందని చెప్పుకోవచ్చు. పూర్తిగా చతికిల పడిపోయి పార్టీకి ఊపిరూది.. అధికార పగ్గాలు చేపట్టేవరకు పార్టీకి లాక్కొచ్చింది ఆయన పోరాట పటిమ. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఆయన చేసిన కృషిని గుర్తించిన కాంగ్రెస్ అధిష్టాం.. చర్చోపచర్చల అనంతరం రేవంత్‌నే ముఖ్యమంత్రిగా ఖరారు చేసింది. అయితే, రేవంత్ రెడ్డి నేడు ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వెన్ను చూపకుండా.. వెనడకుడు వేయకుండా.. అన్ని సమస్యలనూ ఎదుర్కొని ఎదురొడ్డి నిలబడ్డారు రేవంత్ రెడ్డి. విద్యార్థి దశ నుంచే రేవంత్ రెడ్డి రాజకీయాలపై ఎంతో ఆసక్తి కనబరిచేశారు. గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఏబీవీపీ నాయకుడిగా 11 ఇండియా కూటమి భేటీ రద్దు మిగతా 2లో

## భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

**- గవర్నర్ తమిళి సై**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నరేంద్రమోదీ ప్రభుత్వం ఆచరిస్తోందని గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ అన్నారు. బుధవారం అంబేద్కర్ వర్ధంతిసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. డిజిటల్ ఇండియాలో మోదీ ప్రభుత్వం తనదైన ముద్ర వేసుకుందన్నారు. అంబే ద్కర్ గొప్ప నాయ కుడు, నేర్పరి అంటూ కొనియాడారు. అంబేద్కర్ అంటేవ్యక్తిగతంగా తనకు చాలా గౌరవం మిగతా 2లో



## చంద్రబాబుతో పవన్ భేటీ

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ చంద్రబాబుతో మరోసారి భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. పవన్ తో పాటు నాదెండ్ల మనోహర్ ఉన్నారు. వర్షాల కారణంగా పాదయాత్రకు విరామం ఇచ్చి హైదరాబాద్ వచ్చిన నారా లోకేష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే మార్చిలోనే సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో .. కూటమిగా చేయాల్సిన పనులు, సీట్ల సర్దుబాటు, ఇతర ఎన్నికల వ్యూహాలపై వీరు మాట్లాడుకున్నట్లుగా తెలుస్తోంది.



చంద్రబాబు జైలు నుంచి విడుదలైన తర్వాత పవన్ కల్యాణ్ మొదటి సారి చంద్రబాబుతో సమావేశం అయ్యారు.



### మహిళా అధికారుల పదోన్నతులపై
## నాలుగు నెలల్లో విధానం

**- సైన్యానికి గడువు నిర్దేశించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

కల్నల్ ర్యాంకు నుండి బ్రిగేడియర్ ర్యాంకు వరకూ మహిళా అధికారుల పదోన్నతులకు సంబంధించిన విధానాన్ని ఖరారు చేసేందుకు సుప్రీంకోర్టు సైన్యానికి నాలుగు నెలల సమయం ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన బెంచ్ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది ఆర్. బాలసుబ్రమణ్యం వాదనలను నమోదు చేసింది. మహిళా అధికారుల పదోన్నతులపై వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి విధానాన్ని రూపొందించాలని సైన్యానికి ప్రధాన న్యాయమూర్తి సూచించారు. పదోన్నతులలో మిగతా 2లో

### ఈ ఓటమి తాత్కాలిక బ్రేక్ మాత్రమే..
## ఫలితాల పట్ల నిరాశవద్దు

- కార్యకర్తలతో కేటీఆర్ - పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని వ్యాఖ్య
- తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్, బీఆర్ఎస్..
- ప్రజలు ఎప్పటికీ వదులుకోలేరన్న కేటీఆర్
- కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన మాట్లాడుదామని సూచన

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు



ఎన్నికల్లో అనుకోని ఫలితాలు రావడం పట్ల ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని, మన పార్టీ పుట్టిందే పోరాటాల నుంచి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. పోరాటాలు మనకు కొత్త ఏమీ కాదన్నారు. ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్, బీఆర్ఎస్.. ఆ రెండింటిని ప్రజలు ఎప్పటికీ వదులుకోలేరన్నారు.
ప్రస్తుత ఓటమి తాత్కాలికంగా స్పీడ్ బ్రేకర్ మాత్రమే అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఇది స్వల్పకాలం మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఫలితాలపై నిరాశ అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన మాట్లాడుదామన్నారు. పవర్ పాలిటిక్స్‌లో అధికారం రావడం, పోవడం సహజమే అన్నారు. ప్రజలు మనకు కూడా రెండుసార్లు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రలో కూడా రాణిస్తామని, సిరిసిల్లలో ఓటుకు డబ్బులు, మందుపంచనని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు చెప్పారు.



## పిఓకె ఇండియాదే

**- జమ్మూకాశ్మీర్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం**
**-అక్కడ 24 స్థానాల్ని రిజర్వ్ చేశాం**
**- కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ జమ్మూ కాశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. జమ్మూకాశ్మీర్‌లో 83 అసెంబ్లీ సీట్లు ఉండగా వాటిని 90కి పెంచుతున్నట్లు బిల్లులో పేర్కొన్నారు. ఎస్సీలకు 7 సీట్లు, ఎస్టీలకు 9 సీట్లు రిజర్వ్ చేయనున్నట్లు తెలిపారు. బిల్లుపై జరిగిన చర్చలో వివిధ పార్టీల ఎంపిలు మాట్లాడారు. అనంతరం కేంద్ర హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) భారతదేశానికి చెందిందేనని అన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కారణంగా జమ్మూకాశ్మీర్ రెండు తప్పుల్ని చవిచూసిందని ఆయన ఆరోపించారు. నెహ్రూ సరైన చర్యలు తీసుకొనివ్వ న్నట్లయితే పిఒకె మిగతా 2లో

# భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

అని, ఆయన రాజ్యాంగం గురించి తెలిసెందుకు ప్రధాని మోదీ భీమ్ యాప్‌ను ప్రారంభించారని గవర్నర్ తమిళి సై అన్నారు. ఏ దేశంలో అయితే మహిళల అభివృద్ధిజరుగుతుందో... ఆ దేశం అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ అన్నారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని తమిళి సై సూచించారు.

# ఇండియా కూటమి భేటీ రదు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య విభేదాలు మళ్లీ రచ్చకెక్కాయి. కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందన్న భావన ఇండియా కూటమి నేతల్లో నెలకొంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసిందని , మిత్రపక్షాలను పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీ, జేడీయూ వేర్వేరుగా మధ్యప్రదేశ్‌లో పోటీ చేశాయి. విపక్షాల ఓట్లు చీలడంతోనే మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ వైఖరే కారణమని మండిపడ్డారు. అంతేకాకుండా.. కాంగ్రెస్ కలుపుకునిపోకపోవడం వల్ల ఇలాంటి ఫలితాలు వచ్చాయన్న విమర్శలు సైతం కూటమిలోని నేతల నుంచి వినిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ గెలిచినా, ఇండియా కూటమి ఓట్లు చీలడం వల్ల మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అభిప్రాయపడ్డారు. సీట్ల సర్దుబాటు ఉండాలని తాము చెప్పామని కానీ కాంగ్రెస్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో గెలవాలంటే సైద్ధాంతిక బలంతోపాటు, వ్యూహం కూడా అవసమని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో గెలవాలంటే, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటే, బీజేపీ అధికారంలోకి రాదన్నారు.

### మహిళా అధికారుల పదోన్నతులపై

# నాలుగు నెలల్లో విధానం

(మొదటి పేజీ తరువాయి)

వివక్ష చూపుతున్నారంటూ కొందరు మహిళా అధికారులు ఆరోపిస్తున్నారు. మహిళా అధికారుల కోసం శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు 2020 ఫిబ్రవరిలోనే ఆదేశించింది. మహిళలకు శారీరక పరిమితులు ఉన్నాయంటూ కేంద్రం చేసిన వాదనను తోసిపుచ్చింది. ఇది మహి ళలపై లింగ వివక్ష చూపడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. సంప్రదింపులు కొనసాగుతున్నాయి : సైన్యంమహిళా అధికారుల పదోన్నతుల విషయంలో సంప్రదింపులు కొనసాగుతున్నాయని సైన్యం కోర్టుకు తెలిపింది. కల్నల్ ర్యాంకు నుండి బ్రిగేడియర్ ర్యాంకుకు పదోన్నతి పొందాలంటే అధికారులు కొన్ని అర్హతలు పొందాల్సి ఉంటుందని అటార్నీ జనరల్ కోర్టు దృష్టికి తెచ్చారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మహిళా అధికారి తరఫున న్యాయవాది అర్చనా పాఠక్ దేవ్ వాదనలు వినిపిస్తూ మహిళా అధికారులు తమకు రావాల్సిన పదోన్నతుల కోసం చాలా కాలంగా న్యాయస్థానాలలో పోరాడుతున్నారని చెప్పారు.

# పిఓకె మనదే

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లో భాగమై ఉండేదన్నారు. 'రెండు పొరపాట్ల కారణంగా జమ్మూకాశ్మీర్ తీవ్రంగా నష్టపోయింది. మొదటిది.. పాక్‌తో యుద్ధంలో మన సైన్యం గెలుస్తున్నప్పుడు 'కాల్పుల విరమణ' విధించడం. ఆ యుద్ధాన్ని మరో రెండుమూడ్రోజులు కొనసాగించి, ఆ తరువాత కాల్పుల విరమణ పాటించివుంటే పిఒకె దేశంలోనే ఉండేది. రెండోది..మన అంతర్గత సమస్యను ఐక్యరాజ్యసమితి (యుఎన్) దృష్టికి తీసుకెళ్లడం' అని నెహ్రూ తీరుపై ఆరోపణలు గుప్పించారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద సంఘటనలు చోటు చేసుకోకుండా చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, 2026 నాటికల్లా ఆ విషయంలో విజయం సాధిస్తామని చెప్పారు. ఇంతకుముందు కాశ్మీర్ డివిజన్‌లో 46, జమ్మూ డివిజన్‌లో 37 స్థానాలు ఉండేవి.. తాజా బిల్లులో కాశ్మీర్‌లో 47, జమ్మూలో 43కు అసెంబ్లీ స్థానాల్ని పెంచినట్టు అమిత్ షా వెల్లడించారు. పిఒకెను కూడా దేశ భూభాగంగా పరిగణించి అక్కడ 24 స్థానాల్ని రిజర్వ్ చేసినట్లు మంత్రి ప్రకటించారు. అయితే కేంద్ర హోంమంత్రి రాజకీయ ప్రసంగం చేయడం, నెహ్రూపై వివాదస్పద వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు

### - సోనియా రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం రేవంత్ రెడ్డి ప్రమాణం చేయనున్నారు. దీని కోసం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశంలోని ప్రముఖులకు ఆహ్వానం వెళ్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జగన్ మోహన్ రెడ్డిని అహ్వానించారు. ఆయనతోపాటు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబును పిలిచారు. తెలంగాణ మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పిలిచారు. తమిళనాడు సీఎం స్టాలిన్‌కి కూడా ఆహ్వానం అందింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆహ్వానాలు అందాయి. ఎన్నికల్లో సహాయక సహకారాలు అందించిన తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌తోపాటు గాదె ఇన్నయ్య, హరగోపాల్, కంచె ఐలయ్యను ఆహ్వించారు. వివిధ కుల సంఘాల లీడర్లను కూడా ఆహ్వానం పలికారు. ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా సహా ఇతర నేతలందర్నీ ఆహ్వానించారు.

# కాంగ్రెస్‌కు ఊపిరి..!

(మొదటి పేజీ తరువాయి)

### మిగ్‌జాం తుపాను పట్ల అధికారులు

## అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం జిల్లాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, యాదాద్రి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. భారీ వర్ష సూచన ఉన్నందున ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి ఆహారం, సురక్షిత నీరు అందేలా చూడాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, విద్యుత్, రహదారులు దెబ్బతినే పక్షంలో వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి కోరారు.

పని చేసిన రేవంత్ రెడ్డి.. ఆ తరువాత అంచెలంచెలుగా ఎదిగారు. నేడు టీపీసీసీ చీఫ్ స్థానంలో కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చి.. సీఎం రేసులో ముందున్నారు. దీనికంటే ముందుగా రేవంత్ రెడ్డి.. తన రాజకీయ ప్రస్థానాన్ని టీఆర్ఎస్ కార్యకర్తగా ప్రారంభించారు. 2004లో టీఆర్ఎస్ నుంచి కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు రేవంత్. కేసీఆర్ కూడా రేవంత్‌కు ఆ టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నించారు. అయితే, నాడు కాంగ్రెస్‌తో పొత్తుల్లో భాగంగా రేవంత్ రెడ్డికి ఆ సీటు దక్కలేదు. ఆ తరువాత 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీ ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ ఇస్తారని భావించినా మళ్లీ నిరాశే ఎదురైంది. దీంతో బీఆర్ఎస్ ను వీడారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. ఆ తవారుత 2008లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు రేవంత్. రెండుసార్లు ఇండిపెండెంట్‌గా గెలు పొందడంతో రేవంత్ రెడ్డి పేరు హాట్ టాపిక్ అయ్యింది. ఆ తరువాత రేవంత్ రెడ్డిని పిలిపించుకుని చంద్రబాబు టీడీపీలోకి ఆహ్వానించారు. దాంతో ఆయన టీడీపీలో చేరారు. అప్పటి నుంచి పొలిటికల్‌గా చాలా యాక్టీవ్ అయ్యారు రేవంత్ రెడ్డి. ఆ తరువాత 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ టికెట్ కేటాయించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన రావులపల్లి గుర్నాథరెడ్డిపై ఘన విజయం సాధించారు. తొలిసారి అసెంబ్లీలో అడుగపెట్టిన రేవంత్ రెడ్డి.. టీడీపీ తరఫున తన వాయిస్‌ను బలంగా వినిపిం చేవారు.

ఆ తరువాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు రేవంత్ రెడ్డి. 2014-17 మధ్య కాలంలో టీడీఎల్పీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. అయితే, ఓటుకు కేసు పరిణామాల అనంతరం ఆయన తీవ్ర ఆటు పోట్లను ఎదుర్కొన్నారు. కొంతకాలం సైలెంట్ అ య్యారు. ఆ తరువాత కొన్నిరోజుల తరువాత అంటే 2017 అక్టోబర్‌లో టీడీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆయనకున్న క్రేజ్‌తో కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డికి కీలక పదవి ఇచ్చింది. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. అయితే, 2018 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి రేవంత్ రెడ్డి ఓడిపోయారు. దీంతో ఆయన 2019 మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. గెలిచారు.

26 జూన్ 2021లో రేవంత్ రెడ్డిని జాతీయ కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది కాంగ్రెస్ అధిష్టానం. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. సీనియర్లతో విభేదాలు.. ఉప ఎన్నికల్లో వరుస ఓటములు.. నేతల తిట్లు..అన్నింటినీ ఎదుర్కొన్నారు. అయినప్పటికీ.. అవేవీ పట్టించుకోకుండా.. అకుంఠిత దీక్షతో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు అనుబంధంగా రాష్ట్ర ప్రజలకు చేరు వయ్యేందుకు బస్సు యాత్ర చేపట్టారు రేవంత్. అలా నిత్యం ప్రజలకు టచ్‌లో ఉంటూ.. పార్టీని బలోపేతం చేశారు.

నేతల మధ్య సమయన్వయానికి కృషి చేశారు. అదే సమయంలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో.. తెలంగాణలో దాని ప్రభావం చూపింది. కర్ణాటక విజయంతో కాంగ్రెస్ పుంజుకుంది. మొత్తంగా నేటి ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# 18 పదవుల కోసం... 30 మంది పోటీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ సీఎం ఎవరూ అనే సస్పెన్స్ వీడింది. రేవంత్‌ను కన్ఫామ్ చేసిన కాంగ్రెస్ అధినాయకత్వం మిగతా వారికి కూడా భరోసా ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణ మంత్రివర్గంలో 18 మంది వరకు చోటు దక్కనుంది. అయితే మంత్రి వర్గంలో స్థానం కోసం 30 మందికిపైగా నేతలు పోటీ పడుతున్నారు. ఎప్పటి నుంచో కాంగ్రెస్‌లో ఉంటూ రాజకీయాలు చేస్తున్న వారే ఎక్కువ. వారిలో ఎవరెవరికి స్థానం లభిస్తోందో అన్న లెక్కలు వేసుకుంటున్నారు. నల్గొండ నుంచి కోమటి రెడ్డి బ్రదర్స్‌తోపాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి రేసులో ఉన్నారు. ఖమ్మం జిల్లా నుంచి కూడా మల్లు భట్టి విక్రమార్కతోపాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వర్గం కూడా మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇలా దామోదర్ రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, షబ్బీర్ అలీ సుమారు 30 మందికిపైగా నేతలు మంత్రులు అవ్వాలనే టార్గెట్ పెట్టుకున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి పేరు ఖరారు చేసిన తర్వాత ఆయన్ని ఢిల్లీకి పిలిపించుకున్న కాంగ్రెస్ అధినాయకత్వం ఈ జట్టుపైనే కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రేవంత్ నాయకత్వాన్ని అంగీకరించని వారిని సంతృప్తి పరచాల్సి ఉంటుంది. వారికి ఎలాంటి శాఖలు ఇస్తారనే ఉత్కంఠ నెలకొంది. ఉత్తమ్ లాంట వాళ్లు తాము కూడా సీఎం రేస్‌లో ఉన్నామని బహిరంగంగానే చెప్పేశారు. మరి వాళ్ల ఇచ్చే పదవులు ఎలా ఉంటాయో చూడాలి. ఓడిపోయిన నేతలు కూడా కొందరు మంత్రులు కావాలని తహతహలాడుతున్నారు.

జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి లాంటి వాళ్లు ఓడిపోయినప్పటికీ మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ పటిష్టానికి శ్రమించారు. వాళ్లను కూడా సర్దుబాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ అధినాయకత్వానికి ఉంటుంది. వారిని ఎలా సంతృప్తి పరుస్తారో చూడాలి. ఎన్నికల సందర్భంగా కొందరు నేతలకు కూడా మంత్రి పదవిపై కాంగ్రెస్ అధినాయకత్వం హామీ ఇచ్చింది. వారిని కూడా ఈసారి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. వారి విషయంలో ఎలా ముందుకెళ్తారనే ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. డిప్యూటీ సీఎంలు ఎన్ని ఉండాలనే చర్చ కూడా సాగుతోంది. మల్లుభట్టివిక్రమార్క లాంటి వాళ్లు ఒకటే ఉండాలని పట్టుబడుతున్నారు వీటన్నింటిపై ఢిల్లీలో మంతనాలు జరుపుతున్న రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి 10 గంటలకు డీకే శివకుమార్, మాణిక్కం ఠాగూర్‌తో భేటీ అయ్యారు. ఇవాళ మరికొందరితో సమావేశం కానున్నారు. తనకు సీఎం పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞత చెబుతూనే జట్టులో ఎవరెవరు ఉండాలి అనే అంశంపై చర్చిస్తారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో సమావేశం కానున్నారు. గురువారం జరగబోయే ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో పాటు, పలు రాష్ట్రాలకు నాయ కులకు కూడా రేవంత్ ఆహ్వానం పంపించనున్నారు. గురువారం ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 9వ తేదీన సోనియాకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేయబోతున్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ సభ ఉంటుందని మాత్రం కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.


# దివ్యాంగురాలికి రేవంత్ ఆహ్వానం

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

నాంపల్లికి చెందిన దివ్యాంగురాలు రజినీకి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం పంపారు. నెల రోజుల కిందట నాంపల్లికి చెందిన వికలాంగురాలు రజినీ అనే యువతి గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ని కలిసింది. తాను పీజీ పూర్తి చేశానని, ఉద్యోగం రాలేదని, ప్రైవేట్ సంస్థల్లో కూడా ఉద్యోగం ఇవ్వడం లేదని తన ఆవేదనను వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 7వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా దివ్యాంగురాలిని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే తన అర్హతలకు తగ్గ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ స్కీముల కార్డుపై రేవంత్ రెడ్డి స్వయంగా తన దస్తూరీతో దివ్యంగురాలి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆ ఆహ్వానం మేరకు రజనీకి ప్రత్యేక ఆహ్వానం పంపించారు రేవంత్ రెడ్డి. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మాజీ సీఎం కేసీఆర్ కు ఆహ్వానం పంపారు. కేసీఆర్ తో పాటు తమిళనాడు సీఎం స్టాలిన్, సీఎం జగన్, టీడీపీ చీఫ్ చంద్రబాబు, కర్ణాటక సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అశోక్ గెహ్లోట్, భూపేష్ బఘేల్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కాంగ్రెస్ ముఖ్య నేతలు దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, కుంతియా, వాయిలార్ రవి, మాణకం ఠాగూర్, చిదంబరం, మీరాకుమారికి ఆహ్వానం పంపారు. సుశీల్ కుమార్ షిందే, కురియన్ లకు ఆహ్వానం అందింది. వీరిలో ఎంత మంది హాజరవుతారన్నది స్పష్టత లేదు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయగానే ఆ హోదాలో ఆయన చేయబోయే తొలి సంతకం ఆరు గ్యారంటీల అమలుపైనే. దానికి తగినట్లుగా అధికారులు సంబంధిత ఫైళ్ళను సిద్ధం చేస్తున్నారు. ఆరు గ్యారంటీలు వివిధ విభాగాలకు చెందినవి కావడంతో ఆయా శాఖలు వాటి అమలుకు సంబం ధించిన మార్గదర్శకాల తయారీపై ఆ తర్వాత కసరత్తు మొదలుపెడతాయి. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయగానే తొలి సంతకం ఈ గ్యారంటీలపైనే చేస్తారని రాహుల్‌గాంధీతో పాటు రేవంత్ కూడా ఎన్నికల ప్రచారం సమయంలో స్పష్టత ఇచ్చారు. రాహుల్‌గాంధీ సైతం ప్రజల పాలన ప్రారంభమవుతుందని సిక్స్ గ్యారంటీస్‌ను అమలు చేయడానికి తొలి ప్రాధా న్యత ఉంటుందన్నారు.రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడానికి ఒక రోజు ముందు సచివాలయ ఉద్యోగుల్లో సంబురాలు మొదలయ్యాయి. ఫస్ట్ టైమ్ రోడ్డు మీదకు వచ్చి సంతోషాన్ని పరస్పరం పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం జరిగినప్పుడు గద్దర్ పాడిన పొడుస్తున్న పొద్దు మీద.. అనే పాట పెట్టుకుని డ్యాన్సులు చేశారు. మరికొద్దిసేపు బతుకమ్మ ఆడారు. సొంత రాష్ట్రం ఏర్పడితే పరాయి రాష్ట్రంలోని వివక్షకు స్వస్తి చెప్పవచ్చని భావించి ఉద్యమంలోకి దూకామని, కానీ సొంత రాష్ట్ర పాలనలో మాత్రం పారదర్శకత, స్వేచ్ఛ లేకుండా తొమ్మిదేళ్ళు పైకి చెప్పుకోలేని బాధలను అనుభవించామని ఉద్యోగులు వాపోయారు.

# ఢిల్లీకి చంద్రబాబు

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు



టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనలకు సిద్ధమవుతున్నారు. అరెస్టు కారణంగా ఇన్ని రోజులు రాజకీయంగా సైలెంట్‌గా ఉన్న చంద్రబాబు ఇప్పుడు మరింత యాక్టివ్ అవ్వబోతున్నారు. నంద్యాలలో అరెస్టు తర్వాత టీడీపీ కేడర్ ఒక్కసారిగా డీలా పడింది. ఆయన అరెస్టు తర్వాత కార్య కలాపాలు కూడా మందగిం చాయి. ఈ మధ్య లోకేష్ పాద యాత్ర పునః ప్రారంభించారు. ఇప్పుడు చంద్రబాబు కూడా జిల్లాల పర్యటనలు రెడీ అవుతున్నారు. జైలుకు వెళ్లడం, అనంతరం ఆయన ఆరోగ్యం కాస్త క్షీణించడంతో ఇన్ని రోజులు రాజకీయ కార్యకలాపాలకు చంద్రబాబు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ మధ్య ఎంపీలతో సమావేశమై పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. ఈ మధ్యకాలంలో ఏపీలో ఉన్న ప్రముఖ దేవాలయాలు సందర్శించారు. కోర్టుల్లో కూడా పూర్తిగా క్లియరెన్స్ వచ్చినందున తన దృష్టిని పూర్తి స్థాయి రాజకీయలపై పెట్టబోతున్నారు. ముందుగా చంద్రబాబు ఢిల్లీ వెళ్లబోతున్నారు. రాష్ట్రంలో ఓట్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని టీడీపీ ఎప్పటి నుంచో ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు ఎన్నికల ప్రధాన అధికారితోపాటు గవర్నర్‌కు కలిసి వినతి పత్రాలు అందజేశారు. అయినా ఎలాంటి మార్పు రాలేదని భావిస్తున్న టీడీపీ... నేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతోంది. అందులో భాగంగా చంద్రబాబు ఈ నెల 7న ఢిల్లీ వెళ్లబోతున్నారు. ఏపీలో జరుగుతున్న ఓట్ల తొలగింపు, చేర్చడంపై సీఈసీకి ఫిర్యాదు చేయనున్నారు. ఢిల్లీలో ఇంకా ఎవరెవరితో భేటీ అవుతారు. ఇంకా ఏమైనా ముఖ్యమైన అపాయింట్‌మెంట్లు కోరబోతున్నారా అనేది మాత్రం ఇప్పటికి క్లారిటీ లేదు. ప్రస్తుతానికి సీఈసీని కలవడం ఒక్కటే అజెండాలో ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత చంద్రబాబు జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. 11వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారు. ముందుగా 11న శ్రీకాకుళంలో పర్యటిస్తారు. అక్కడ ప్రజలతో మాట్లాడబోతున్నారు. అనంతరం 12న కాకినాడలో పర్యటిస్తారు. 14న నరసరావుపేట, 15న కడపలో చంద్రబాబు టూర్ ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నారు.

### సంపాదకీయం

# విలవిలలాడిన చెన్నై...



మిచౌంగ్ తుఫాన్ బీభత్సం సృష్టిస్తోంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'మిగ్జామ్' తుపాను చెన్నై నగరంలో వర్ష బీభత్సం సృష్టించింది. అతి భారీ వర్షాలతో చెన్నై పూర్తిగా జలమయం అయింది. నగరంలో ఎటు చూసినా నీరే. దీనిపై తమిళనాడు పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ స్పందించారు. నగరంలో గత 70-80 ఏళ్లలో ఎన్నడూ లేనంత వర్షం కురిసిందని వెల్లడించారు. తనకు తెలిసినంతవరకు చెన్నై ఇంతటి భారీ వర్షాలను ఎప్పుడూ ఎదుర్కోలేదని తెలిపారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ, తుపాను తీవ్రత దృష్ట్యా ఆ చర్యలు సరిపోలేదని వెల్లడించారు. తుపాను విలయం ముందు తమ యంత్రాంగం విఫలమైందని కేఎన్ నెహ్రూ అంగీకరించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ద్వారా 3 లక్షల మందికి ఆహారం అందిస్తున్నట్టు తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు బోట్లు పంపించామని చెప్పారు. సహాయ చర్యల కోసం 5 వేల మంది సిబ్బందిని ఇతర జిల్లాల నుంచి రప్పించామని వెల్లడించారు. కాగా, చెన్నైలో కుండపోత వానలు కురుస్తుండడంతో విమానాశ్రయంలోకి నీళ్లు ప్రవేశించాయి. దాంతో మూడు విమానాలను బెంగళూరుకు మళ్లించారు. వరద నీరు ప్రవేశించడంతో 14 రైల్వే సబ్ వేలను అధికారులు మూసివేశారు. పలు ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాంబరంలో నీటిలో చిక్కుకుపోయిన 15 మందిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. తుపాను కారణంగా నగరంలోని కోర్టులకు సెలవు ఇచ్చినట్టు మద్రాస్ హైకోర్టు ప్రకటించింది. అటు, చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమిళనాడుపై తుఫాన్ ప్రభావం ఓ రేంజ్‌లో ఉంది. ముఖ్యంగా చెన్నై నగరం చిగురుటాకులా వణికిపోతోంది. చెన్నైలోని ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా చెన్నై అంధకారంగా మారింది. భారీ వర్షాల కారణంగా 8 మంది మృతి చెందారు. చెన్నై సహా తిరువల్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టులో రెడ్ అలర్ట్ జారీ చేశారు. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. అత్యధికంగా ఆవడి ప్రాంతంలో 30 సెం.మీ వర్షపాతం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా సబ్‌వేలు మూసివేశారు. నిత్యవసర సరకుల కోసం జనం ఇక్కట్లు పడుతున్నారు. సహాయక చర్యలు కోసం సైన్యం రంగంలోకి దిగింది. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు చెన్నై అతలాకుతలమైంది. నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల వీధుల్లోకి భారీగా వరద నీరు చేరి పలు కార్లు కొట్టుకుపోయాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. పలు కాలనీల్లో నీరు నిలిచిపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇక చెంగల్పట్టులోని పలు ప్రాంతాలపై భారీ వర్షం, సముద్రపు గాలులు తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చెన్నైలో పలు సబ్‌వేలను మూసేశారు. నీటి ప్రవాహానికి కార్లు కొట్టుకుపోయాయి. ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆరెఫ్ బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి.. ఇప్పటివరకూ 300 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు. ఇక భారీ వర్షానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మే 9-15 మధ్య వచ్చిన మోచా తుపాను చైనా, బంగ్లాదేశ్, భారత్, శ్రీలంకను వణికించేసింది. 1.5 బిలియన్ల ఆస్తి నష్టం సంభవించగా 463 మంది మృత్యువాత పడ్డారు. జూన్ 6-19 మధ్య వచ్చిన బిపర్‌జాయ్ తుపాను కూడా అదే స్థాయి నష్టాన్ని మిగిల్చింది. ఇది ఇండియా పాకిస్థాన్‌పై ఎక్కువ ప్రభావం చూపించింది. 124 మిలియన్ల రూపాయల ఆస్తినష్టం సంభంవించగా 17 మంది చనిపోయారు. తేజ్ పేరుతో అక్టోబర్‌లో 20-24 మధ్య వచ్చిన తుపాను ఒమన్, యెమెన్ దేశాల్లో చాలా తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అక్టోబర్ 21-25 మధ్య బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్, మిజోరాంలో భయంకరమైన తుపాను వచ్చింది. దీని కారణంగా 567 మిలియన్ల రూపాయల నష్టం వాటిల్లింది. 17 మంది మృత్యువాత పడ్డారు. అదే ప్రాంతాన్ని కవర్ చేస్తూ నవంబర్ 14-18 మధ్య మిథిలి అనే పేరుతో తుపాను బీభత్సం సృష్టించింది. 276 మిలియన్ల ఆస్తి నష్టం జరగ్గా ఏడుగురు చనిపోయారు. ప్రస్తుతం మిగ్‌జాం పేరుతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకొని తుపాను కొనసాగుతోంది. ఇది ఎంత నష్టాన్ని మిగులుస్తుందో అధికారులు అంచనా వేయలేకపోతున్నారు.

# భారత్ అబ్బాయి..పాకిస్థాన్ అమ్మాయి

## - పెళ్లికి అంతా సిద్ధం

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

భారత్ అబ్బాయి, పాకిస్తాన్ అమ్మాయి. ఒకరికొకరు ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కొవిడ్ సహా కొన్ని అడ్డంకులు వారిని ఐదేళ్లు దూరంగా ఉంచాయి. చివరికి తనకు కాబోయేవాడి కోసం భారత్ లో అడుగుపెట్టింది పాక్ యువతి. బాజా భజంత్రీల మధ్య ఆమెకు ఘన స్వాగతం లభించింది.



ఈ మధ్య కాలంలో ఒక దేశానికి చెందిన పౌరులు, మరో దేశానికి చెందిన పౌరులతో ప్రేమలో పడటం, పెళ్లిళ్లు చేసుకోవడం బాగా పెరిగిపోయింది. సరి హద్దులు దాటుతున్న ఈ ప్రేమలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా అలాంటిదే మరొక సరిహద్దులు దాటిన ప్రేమ కథ ఇంటర్నెట్లో చక్కెర్లు కొడుతోంది. తల్లి మొబైల్‌లో యువతి ఫొటో చేసి, ఆమె మరో దేశానికి చెందిన యువతి అని తెలిసి, పంతం నెగ్గించుకుని పెళ్లిపీటలు ఎక్కబోతున్న ఓ యువకుడి ప్రేమ కథపై నెటిజన్‌లు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. మరె ఆ ప్రేమ కథ గురించి మనం కూడా తెలుసుకుందాం పదండి. పశ్చిమబెంగాల్‌కు చెందిన సమీర్‌ఖాన్ అనే యువకుడు జర్మనీలో చదువు పూర్తిచేసుకుని అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో 2018లో అతను కుటుంబసభ్యులను చూసేందుకు భారత్‌కు వచ్చాడు. ఆ సమయంలో అతను తన తల్లి మొబైల్ ఫోన్‌లో ఒక యువతి ఫొటోను చూసి ముగ్ధుడైపోయాడు. ఆమె అందానికి దాసోహమయ్యాడు. పెళ్లంటూ చేసుకుంటే ఆమెన చేసుకుంటానని పేరెంట్స్‌పై ఒత్తిడి తెచ్చాడు. కొడుకు కోరిక కాదనలేక సదరు యువతి గురించి అతని పేరెంట్స్ ఆరా తీశారు. కొద్దిపాటి ప్రయత్నంతోనే ఆమె పాకిస్థాన్‌లోని కరాచీ నగరానికి చెందిన జవేరియా ఖానుమ్ అని గుర్తించారు. ఆ తర్వాత యువతి పేరెంట్స్‌ను కాంటాక్ట్‌లోకి తీసుకుని మాట్లాడారు. ఒకరి గురించిన మరొకరు తెలుసుకున్న తర్వాత ఏకంగా పెళ్లి సంబంధం ఖాయం చేసుకున్నారు. అయితే, వెంటనే పెళ్లి చేసుకోవడంలో వారికి కొన్ని అడ్డంకులు ఎదుర య్యాయి. సమీర్‌ఖాన్ ఉద్యోగరీత్యా జర్మనీకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత కరోనా విజృంభించడం, అనంతరం జవేరియా ఖానుమ్ భారత్‌కు వచ్చేం దుకు రెండు సార్లు ప్రయ త్నించినా వీసా తిరస్కరణకు గురికావడం లాంటి పరిణామాలతో ఐదేళ్లు గడిచిపో యాయి. అయితే ఈ ఐదేళ్లలో వారు ఒకరినొకరు కలుసు కోకపోయినా మొబైల్‌లో టచ్‌లో ఉన్నారు. వారి మధ్య ప్రేమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ క్రమంలో తాజాగా జవేరియా ఖానుమ్‌కు 45 రోజుల గడువుతో భారత్ వీసా లభించింది. దాంతో ఆమె భారత్‌కు చేరుకుంది. పాకిస్థాన్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు వచ్చిన జవేరియాను సమీర్‌ఖాన్ కోల్‌కతాకు తీసుకొచ్చాడు. సమీర్ కుటుంబసభ్యులు ఆమెకు బాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. త్వరలోనే ఆ ఇద్దరు ప్రేమికులు పెళ్లి బంధంతో ఒక్కటి కాబోతున్నారని సమాచారం. అలా జరిగితే వీళ్ల ప్రేమ ప్రయాణం చరిత్రలో నిలిచిపోనుంది.

### ముగ్గురు ఎంపీల రాజీనామాతో

# పార్లమెంట్ ప్రాతినిధ్యం జీరో

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చింది కానీ.. ముగ్గురు ఎంపీ లను కోల్పో తోంది. ఎంపీ పదవికి రాజీ నామా చేసే యోచనలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఆయన రాజీనామా చేయనున్నారు. నిబంధన లకు అనుగుణంగా ఎమ్మెల్యేగా పదవీ ప్రమాణం చేసే ముందు లోకసభ సభ్యత్వానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా సమర్పించాల్సి ఉంది. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలకు మరో ఏడు నెలల సమయం ఉంది. అయితే గత ఎన్నికల్లో పార్లమెంటు సభ్యులుగా గెలిచిన వారిని మాత్రం తొలి జాబితాతోనే సీటు దక్కింది. ఇది తొలి నుంచి ఊహిస్తున్నదే. ముగ్గురూ సీనియర్ నేతలు కావడం, పట్టున్న లీడర్లే కావడంతో తొలి నుంచి ఈ అంచనాలు వినపడుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఆయనే. కొడంగల్ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆ తర్వాత జరిగిన పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో మల్కాజ్ గిరి నుంచి విజయం సాధించారు. మరోసారి కొడంగల్ నుంచి పోటీ చేసి రేవంత్ రెడ్డి విజయం సాధించారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే ముందు రాజీనామా చేయనున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అంతే. ఆయన నల్లగొండ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2018 ఎన్నికల్లో హుజూర్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు ఆయన శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కానీ మరోసారి ఆయన అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి ఘన విజయం సధించారు కాంగ్రెస్ కు పీసీసీ చీఫ్ గా పనిచేసిన ఆయన రెండుసార్లు అధికారంలోకి మాత్రం తేలేకపోయారు. ఇప్పుడు ఎమ్మెల్యేగానే కొనసాగ నున్నారు. అందుకే ఎంపీ పదవికి రాజీనామా చేయనున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి భువనగిరి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన కూడా సీనియర్ నేత. కోమటిరెడ్డి గత ఎన్నికల్లో నల్లగొండ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో భువనగిరి పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి నల్లగొండ నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు కాంగ్రెస్ కు ఉంటే.. వారు ముగ్గురూ గెలిచారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేయక ముందే వారు రాజీనమా చేయాల్సి ఉంది. బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు . ఆయన కూడా రాజీనామా చేయనున్నారు. బీజేపీ తరపున ఉన్న నలుగురు ఎంపీల్లో ముగ్గురు పోటీ చేశారు . కానీ ముగ్గురూ ఓడిపోయారు.

# మూడు రాష్ట్రాల్లో కొత్త సీఎంలు

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

టీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో మూడు చోట్ల ఘన విజయం సాధించింది బీజేపీ. కాంగ్రెస్ ఖాతాలో ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌నీ కైవసం చేసుకుంది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్‌లోనూ మరోసారి అధికారంలోకి వచ్చింది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. సరిగ్గా వీటి ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కావడం వల్ల బీజేపీ పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలనూ తలకిందులు చేసి బీజేపీ భారీ మెజార్టీ సాధించింది. ప్రభుత్వం ఏర్పాటుకి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి అభ్యర్థులపైనే మేధోమథనం జరుగుతోంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే కీలక అభ్యర్థులతో సమావేశమయ్యారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు చర్చించారు. ఈ సమావేశంలో మూడు రాష్ట్రాలకు ముఖ్యమంత్రి రేస్‌లో ఉన్న అభ్యర్థులతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. మూడు రాష్ట్రాల పార్టీ ఇన్‌ఛార్జ్‌లతోనూ సమావేశమయ్యారు అమిత్‌షా, జేపీ నడ్డా. అయితే...బీజేపీ జాతీయ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

ప్రత్యేకంగా పరిశీలకులను నియమించనుంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ఈ పరిశీలకులు సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ తరవాత ముఖ్యమంత్రి అభ్యర్థిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. మధ్యప్రదేశ్‌కి ఇప్పటి వరకూ శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయితే..ఈ సారి ఆయనకు పోటీగా పలువురు కేంద్రమంత్రులు ఈ రేస్‌లో ఉన్నారు. ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్ర సింగ్ తోమర్‌తో పాటు కైలాశ్ విజయ్‌వర్గియ కూడా పోటీ పడుతున్నారు. ఇక రాజస్థాన్‌లోనూ ముఖ్యమంత్రి రేస్‌లో చాలా మందే ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ బీజేపీ ప్రెసిడెంట్ సీపీ జోషి, దియా కుమారి, మహంత్ బాలాకాంత్ రేసులో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ ముఖ్యమంత్రి రేసులో ప్రధానంగా కనిపిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ సావో, ప్రతిపక్ష నేత ధరమలాల్ కౌశిక్, మాజీ ఎంఏ అధికారి ఓపీ చౌదరి కూడా ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. అయితే.. హైకమాండ్ మాత్రం ఇంకా ఎవరినీ ఫైనల్ చేయలేదు. మరికొద్ది రోజుల్లో ఈ విషయంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

# కనిష్ట స్థాయికి పడిపోయిన రూపాయి

ముంబై - ప్రభాత సూర్యుడు

ఫారెక్స్ రింగ్‌లో అమెరికన్ డాలర్ బలం ముందు రూపాయి నిలబడలేకపోతోంది, రోజురోజుకూ నీరస పడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరో మారు జీవితకాల కనిష్ట స్థాయికి చేరుకుంది. రూపాయి తన జీవిత కాల కనిష్ట స్థాయి రూ.83.41కి చేరుకుంది. ఇందులో, ప్రారంభ ట్రేడింగ్‌లోనే 3 పైసల పతనం నమోదైంది. దేశంలోకి దిగుమతులు పెరుగుతున్నాయి. చెల్లింపుల కోసం వాళ్లకు డాలర్లు కావాలి. ఈ నేపథ్యంలో, దేశీయ దిగుమతిదార్ల నుంచి డాలర్లకు భారీ డిమాండ్ ఉంది. ఈ కారణం వల్లే రూపాయి క్షీణిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ద్రవ్య విధానాన్ని సమీక్షించడం ప్రారంభిస్తుంది, సమావేశం ఫలితం శుక్రవారం వెలువడుతుంది. డాలర్లకు డిమాండ్ పెరగడానికి ఇది కూడా ఒక కారణం. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత దిగజారి 83.50 స్థాయికి పడిపోవచ్చని అంచనా వేశారు. ట్రేడింగ్‌లో కూడా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోయింది, రూ. 83.38 వద్ద ముగిసింది. మరోవైపు, అమెరికా నుంచి కీలక ఆర్థిక డేటా కూడా విడుదల కావల్సి ఉంది, రూపాయి విలువపై అది స్పష్టమైన ప్రభావం చూపుతుంది. ప్రపంచంలోని ఆరు ప్రధాన కరెన్సీలతో జూ డాలర్ స్థితిని ప్రతిబింబించే డాలర్ ఇండెక్స్ 103.62 స్థాయి వద్దకు చేరింది, 0.09 శాతం క్షీణించింది. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ కూడా 0.05 శాతం తగ్గి బ్యారెల్‌కు 77.99 డాలర్ల వద్దకు చేరింది. స్టాక్ మార్కెట్ డేటా ప్రకారం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదార్లు (ఈఎఎబ ఆజీబిజీ) సోమవారం రూ. 2,073.21 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నెట్ సెల్లర్స్‌గా ఉన్న ఎఫ్ఐఐలు, నవంబర్ నెలలో నెట్ బయ్యర్స్‌గా టర్న్ అయ్యారు. అదే పంథా డిసెంబర్ ప్రారంభంలోనూ కొనసాగుతోంది. ఇప్పుడు అందరి చూపు రెపో రేటుపైనే ఉంది. అయితే, ద్రవ్యోల్బణం రేటు 5 శాతం దిగువకు పడిపోయే అవకాశం చాలా తక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో, తన స్టాండ్‌లో ఖీఃఎ ఎటువంటి మార్పు చేయకపోవచ్చు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నాలుగు ఓఖఅ సమావేశాలు జరిగాయి. ఆ నాలుగు సమావేశాల్లోనూ రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదు.

## ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాలతో రేవంత్ రెడ్డి భేటీ

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు :** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను కలుస్తూ బిజీ బిజీగా ఉన్నారు. గురువారం ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి అందరినీ పేరు పేరున ఆహ్వానిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయంఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాలతో భేటీ అయ్యారు. ఆయను మర్యాదపూర్వకంగా రేవంత్ రెడ్డి కలిసారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ ముగిసిన అనంతరం రేవంత్ రెడ్డి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను కలవడానికి వెళ్లారు. అనంతరం సోనియాగాంధీతో భేటి కానున్నారు. తన ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా అధిష్టానం పెద్దలకు రేవంత్ రెడ్డి ఆహ్వానం పలుకుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిగారేవంత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన తరువాత తొలిసారి ఆయన మంగళవారం రాత్రి ఢిల్లీకి వచ్చారు. ఏఐసీసీ పరిశీలకులు, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, రాష్ట్ర మాజీ ఇంచార్జ్మాణికం ఠాకూర్‌లతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. పార్టీ పెద్దలు సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసి వేణుగోపాల్ తదితరులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. పార్టీపెద్దలందరినీ తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించనున్నారు. అక్కడ పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్‌కు బయలుదేరి వస్తారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది మాత్రమే ఉంటుంది

### బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు:** గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించిన ఆయన.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది మాత్రమే ఉంటుందని ప్రకటించారు. ఏడాది తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని రాజా సింగ్ అన్నారు. కేసీఆర్ చేసిన అప్పులు తీర్చే క్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని మారుస్తానని ప్రకటించిన కేసీఆర్‌నే తెలంగాణ ప్రజలు మార్చేశారని రాజా సింగ్ ఎద్దేవా చేశారు. దేశంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అందరూ నివాళులర్పిస్తున్నారని.. వాళ్లు గర్వంగా జీవించడానికి.. వాళ్లకు న్యాయం జరగడానికి అంబేద్కర్ కారణమని రాజా సింగ్ తెలిపారు. అందుకే అన్ని వర్గాలు అంబేద్కర్‌ను స్మరించుకుంటాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ పాలన గురించి ప్రస్తావిస్తూ.. తెలంగాణలో రావణ రాజ్యం అంతమైందని రాజా సింగ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ రావణుడు అని.. తెలంగాణ ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. ఎస్సీలను కేసీఆర్ మోసం చేశారన్నారు. దళితులను ముఖ్యమంత్రి చేస్తామని.. మూడెకరాల భూమి, దళిత బంధు ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేసినట్లు వివరించారు. అంబేద్కర్‌కు కేసీఆర్ ఎప్పుడూ నివాళులర్పించలేదన్నారు. బీజేపీ ఒత్తిడితోనే హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీ సమాజాన్ని మోసం చేసి కేసీఆర్ ఫాంహౌస్‌లో కూర్చున్నాడని.. కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించారని రాజా సింగ్ విమర్శలు చేశారు. కేసీఆర్ స్కీంలను అమలు చేస్తానని రేవంత్ అన్నారని.. దళితులను రేవంత్ మోసం చేస్తే బీజేపీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి మోదీ అని రాజా సింగ్ పేర్కొన్నారు.

## బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సామాజికంగా ఎదగాలి

### జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత



**జగిత్యాల-ప్రభాత సూర్యుడు:** బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సామాజికంగా ఎదగాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అన్నారు. బుధవారం ఐడీవోసీ లో బి.ఆర్. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనమైన నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ ఎదగాలని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని అన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు వేసే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచామని తెలిపారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లు గా నమోదు చేసి ఉత్సాహంగా ఓటు వేశారని, పరిశీలకులు కూడా అభినందించారని తెలిపారు. ప్రజా స్వామ్యం లో ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం జరగాలని అన్నారు.

# మహానేత బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళులు









**కుత్బుల్లాపూర్ -ప్రభాత సూర్యుడు:** భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత దేశ ప్రజలకు పటిష్టమైన భారత రాజ్యాంగాన్ని అందించిన మహా గొప్ప నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్ట గూడవరమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల తో నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులకు మైనార్టీలకు బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావడమే నిజమైన స్వాతంత్రమని అదే అంబేద్కర్ ఆశయమని ఆయన అన్నారు. మతోన్మాదులు భారత రాజ్యాంగాన్ని ఆపాసు పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అంబేద్కర్ ఆశయ సాధన కోసం యువకులు ప్రజలందరూ కలిసికట్టుగా దేశ రక్షణ భద్రతకు పని చేయవలసి ఉన్నదని ఆయన అన్నారు. సామాజిక తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పడాలని సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో సామాజిక న్యాయం జరగాలని గూడ ఐలయ్య కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ, బి రామారావు పంతులు, వడ్డే ప్రశాంత్ ,దళిత నాయకులు బండి యాదగిరి ,శేఖర్ , ఐ ఎన్ టి యు సి విద్యుత్ కార్మిక సంఘం నాయకులు శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు మంగ ,సులోచన, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 67 వ వర్ధంతి పురస్కరించుకొని చిన్న శంకరంపేట మండలం జంగారాయి గ్రామంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి బందెల సాయిలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారత రాజ్యాంగానికి ప్రధాన రూపశిల్పి, స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా, దేశంలోనే ప్రముఖ న్యాయ నిపుణుడిగా ఆర్థికశాస్త్ర వేత్తగా ,సంఘసంస్కర్తగా నాటి కాలంలో మన అంబేద్కర్ ఎంతో ప్రసిద్ధిగాంచారని ఆయన అన్నారు. అంబేద్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని నేడు ప్రతి రంగంలో రిజర్వేషన్ల గుర్తింపు ఆయనదేనని బందెల సాయిలు అన్నారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీపతి, మాజీ సర్పంచ్ వడ్ల శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు భూపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు కర్రోళ్ల స్వామి ,కర్రోళ్ల ప్రభాకర్, బాలరాజ్ ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు:** భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకొని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి



అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం పనిచేయాలని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల మాల మహానాడు అధ్యక్షులు ఆడపడుచు నాగరాజు అన్నారు. ఆయన జీవితం నేటి తరానికి యువతకు ఆదర్శప్రాయం అని ఆయన విగ్రహానికి పూలమాలవేసి సత్కరించారు .ఈ కార్యక్రమంలో మేకల స్వామి, భాను, మల్ల రాజు గుడిబండ రాజు, ప్రదీప్, వార్డు సభ్యులు సడిమెల లక్ష్మీ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్మెట్ -ప్రభాత సూర్యుడు:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్-3 లో భారతరత్న బి ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొని అంబేద్కర్ గారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని, విశ్వ నాయకుడని, ప్రపంచ మేధావని ఆయన దేశనికి మార్గదర్శకాలు చూపారని భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులననిసరించే ప్రజాస్వామ్య పద్ధతిలో పేదల కోసం ప్రశ్నించే గొంతుకై సిపిఐ ఉద్యమివస్తుందని అందులో భాగంగానే పాపాయి గూడ భూదాన భూమిలో పేదలకు ఇంటి స్థలాల కోసమై11నెలలుగా పోరాటం సాగిస్తున్నామని గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఐ పోరాటానికి గుడిసె వాసులకు సహకారం ఇస్తారని ఆశాభావం వ్యక్తపరిచారు కార్యక్రమంలో పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, యేశాలనర్సింహా, పుల్లయ్య నవనీత అరుణ నారాయణ రెడ్డి సైదులు ముదిరాజ్ దేవమ్మ క్రాంతి వినోద్ నరేష్ పాల్గొన్న

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మహేష్ గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అంటరానితనాన్ని వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. మనుషులంతా ఒకటేనని చాటి చెప్పిన మహనీయుడు. భారత స్వతంత్ర సమరయోధుడు రాజ్యాంగ రచయిత దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత భారత దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం స్వతంత్ర భారత తొలి న్యాయ శాఖ మంత్రి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల మాజీ వైస్ ఎంపీపీ ఆవుల మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షులు సొప్పరి దశరథ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేతాల సంజీవ, నాయకులు ఆవుల జగన్, సయ్యద్ అజగర్, మంథని మల్లేష్, యాట సుందర్, యాట సుధాకర్, పరమేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆవుల వినయ్ కుమార్, పెరుమాళ్ళ లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల రేవంత్ రెడ్డి అమలుపై తొలి సంతకం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** సీఎం రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 1:4 గంటలకు ఎల్బీ స్టేడియంలో ప్రమాణం చేస్తారు. ఈ కార్యక్రమం అయిన వెంటనే ప్రమాణ స్వీకార సభలో ముందుగా 6 గ్యారెంటీల అమలుపై తొలి సంతకం చేయనున్నారు. ఈ 6 గ్యారెంటీలు ఎప్పటి నుంచి అమలు కానున్నాయో సభా వేదికపై ఆయన ప్రకటించనున్నారు. కాగా ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఢిల్లీలో బిజీ బిజీగా గడుపుతున్నారు. తన ప్రమాణస్వీకారకార్యక్రమానికి పలువురు ముఖ్య నేతలను ఆహ్వానిస్తున్నారు. అక్కడ పనులు పూర్తి చేసుకుని ఇవాళ సాయంత్రం హైదరాబాద్‌కు వస్తారు. గురువారం మధ్యాహ్నం 1:4 గంటలకు ఎల్బీ స్టేడియంలో సీఎంరేవంత్ రెడ్డి ప్రమాణం చేస్తారు. ఆ కార్యక్రమానికి హాజరుకావాలని ఏఐసీసీ నేతలకు, ఇతర రాష్ట్రాల నేతలకు రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే,



సోనియా, రాహుల్,ప్రియాంక, ఏఐసీసీ నేతలను ఆహ్వానించారు. అలాగే కర్ణాటక సీఎం సిద్దిరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆ రాష్ట్ర మంత్రులను కూడా ఆహ్వానించారు. రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్మాజీ సీఎం భూపేష్ బఘెల్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్, గతంలో ఇంచార్జిలుగా పనిచేసిన దిగ్విజయ్ సింగ్, వీరప్పమొయిలీ, కుంతియా, వాయిలార్ రవి, మాణిక్కం ఠాగూర్, మరికొందరుముఖ్యులను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన చిదంబరం, మీరాకుమారి, సుశీల్ కుమార్ షిండే, కురియన్, మరికొందరు నేతలను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ అమరుల కుటుంబాలను కూడా పిలిచారు. కోదండరామ్, గాదె ఇన్నయ్య, హరగోపాల్, కంచ ఐలయ్యలతోపాటు మరికొందరు ఉద్యమ కారులు, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కూడా ఆహ్వానం పంపనున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్, ఏపీ సీఎం జగన్ తోపాటు మాజీ సీఎం చంద్రబాబు, సినీ నటులను పిలిచారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటువివిధ కుల సంఘాల నేతలు, మేధావులను రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215